10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం 11 డిసెంబర్ 2024 పేజీలు 8



గాజులరామారం మహాదేవపురంలో సీజ్ చేసిన నిర్మాణం..

- కుత్బుల్లాపూర్, గాజులరామారం జీహెచ్ఎంసి సర్కిల్లలో టిజి-బిపాస్ చట్టం నిర్వీర్యం..
- టౌన్‌ప్లానింగ్ వ్యవస్థను, అపహాస్యం చేస్తున్న కరెప్షన్ అధికారులు..
- చట్టం తెలిసిన కమిషనర్‌ల విధులు సైతం సైలెంట్.. పట్టణ ప్రణాళికలో బహిరంగ దోపిడీ..
- అధికారులు చట్టాన్ని గౌరవించరు..! అక్రమార్కులు నిబంధనలు పాటించరు..!!
- జీహెచ్ఎంసిలో జలగలు.. చైన్‌మెన్ నుండి ఉన్నతాధికారుల వరకు వాటాలు..?
- నోటీసులను చిత్తు కాగితంలా భావిస్తూ.. కలెక్షన్‌లకే అధికారులు ప్రాధాన్యత..?
- కూల్చివేతలపై సుప్రీంకోర్టు 'స్టే' ఉందన్న సాకుతో అక్రమ కట్టడాలకే మొగ్గుచూపుతున్న వైనం..

## సీజింగ్‌లు..! స్పీకింగ్ నోటీసులు..!

# ఉత్తుత్తివేనా..!

- సంబంధిత అక్రమ నిర్మాణాల్లో..యధావిధిగా పనులు..
- సీజ్ చేసి నోటీసులు ఇచ్చిన నిర్మాణాలపై..! శాశ్వత చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయా..?
- చట్టాలు పక్కనపెట్టి..! నిర్మాణాలు పూర్తి చేయడానికి సహకరిస్తున్న టౌన్‌ప్లానింగ్..

గాజులరామారం మహాదేవపురంలో సీజ్‌చేసిన అక్రమ నిర్మాణంలో పనులు..





గాజులరామారం శ్రీరామ్‌నగర్‌లో అక్రమ నిర్మాణం సీజ్..

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 10:**

అవును తెలంగాణ రాష్ట్రంలో ఏదైనా సాధ్యమే.. ప్రభుత్వాలే ఉద్యోగులను చూసి భయపడుతున్నారో..! లేక కొందరు సిఫార్సుల కోసమే అన్నట్టు, ప్రోటోకాల్ నేతలు, ప్రజాప్రతినిధుల అండతోనే ఇలా వ్యవహరిస్తున్నారో తెలియదు కానీ..! కొన్ని శాఖల అధికారుల విధుల తీరు ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తుంది.. అధికారుల బరితెగింపు భవిష్యత్తు తరాలకు ప్రమాదాలు తలపెట్టే విధంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. మరోవైపు అధికారులకి కూడా యూనియన్‌లు ఉండటంతో..! పాలకులు కూడా చర్యలకి వెనుకడుగు చేస్తున్నట్లు జరుగుతున్న పరిణామాలతో స్పష్టమవుతుంది.. యూనియన్‌లు అనేవి అన్యాయాలను ఎదురించే విధంగా ఉండాలి కానీ..! తమ మోసపూరిత, స్వార్థపూరిత వ్యవహారాలకు యూనియన్ జోక్యం ఉండకూడదు.. ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలు, కోట్లు ముడుపులు చెల్లించగలిగే, భూ కబ్జాదారులకు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాచేసే కేటుగాళ్ళకే, సంబంధిత అధికార యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తున్నారు.. కాదని చెప్పమనండి..! నిలదీస్తే సమాధానం ఉందా..? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులకు ఉన్న భద్రత ప్రస్తుతం ఉందా..? తెలంగాణ రాష్ట్రం సాధించి తెచ్చుకున్నది ఇందుకోసమేనా..? చట్టాలను అమలు చేసిన ప్రభుత్వాలు..అవే చట్టాలను ఏమేరకు ఆచరణలో పెడుతున్నాయి.. ప్రశ్నించే తత్వాన్ని పౌరులు, ప్రజలు కోల్పోయారా..? ఏముందిలే పత్రికలు వార్తలు రాస్తే పట్టించుకోకపోతే సరిపోతుందని అధికారులకు ధైర్యాన్ని ఇచ్చింది ఎవరు..? అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ వ్యత్యాసం ఏముంది..? రాష్ట్రాన్ని పాలించే పాలకులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ..! అధికార యంత్రాంగాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ప్రజల ఆస్తులకు (సర్కారు భూములకు) రక్షణ కల్పించగలరా..? చట్టాలకు విలువలేదా..? అధికారులు జారీచేసే నోటీసులకు విలువలేదా..? టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో పెరిగిపోతున్న చీడ పురుగులను ఏరివేయకపోతే హైదరాబాద్ మహానగరం ప్రమాదకర కట్టడాలకు నిలయంగా తయారవుతుంది.. తస్మాత్ జాగ్రత్త..

-2లో

## తహశీల్దార్ కార్యాలయాన్ని.. అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..



ఘట్‌కేసర్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

- తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్..
- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు..
- పెండింగ్‌లో ఉన్న ధరణీ దరఖాస్తులు, భూ సేకరణ, ప్రభుత్వ భూమిలపై సమీక్ష నిర్వహించారు..

-4 లో

## సాంకేతిక పరిజ్ఞానంతో పాటు.. ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశం..

ఐటిఐ మహిళా కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు..

- మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో హిందుస్తాన్ ఏరోనాటికల్ వారి సౌజన్యంతో కళాశాల..
- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నూతనంగా నిర్మించిన ఐటిఐ కళాశాలల ప్రారంభం..
- మహిళా సాధికారత దిశగా ఘట్కేసర్ మండలంలో మహిళల కోసం ఐటిఐ కళాశాల నిర్మాణం..
- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు..

-3 లో



# సీజింగ్‌లు..! స్పీకింగ్ నోటీసులు..! ఉత్తుత్తివేనా..!



కుత్బుల్లాపూర్ సర్కిల్-25 పరిధి సుభాష్ నగర్‌లో సీజ్ చేసిన షెడ్డు పూర్తి..



కుత్బుల్లాపూర్ సర్కిల్-25 పరిధిలో నిర్మాణం సీజ్..



గాజులరామారం శ్రీరామ్ నగర్‌లో..




## సర్కిల్-26లో నోటీసులు, సీజింగ్‌లు..

గాజులరామారం సర్కిల్-26 పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి.. కొన్ని రంగులేసినవి, మరికొన్ని అండర్ కన్‌స్ట్రక్షన్‌లో.. ఈ విషయం డిప్యూటీ కమిషనర్ నుండి టౌన్‌ప్లానింగ్ చైన్‌మెన్ వరకు తెలిసిందే కానీ చర్యలు తీసుకోరు.. పత్రికల పోరు పడలేక నోటీసులు, సీజింగ్‌లు ఉంటాయో ఏమో కానీ..! ఒక్క నిర్మాణంపై కూడా శాశ్వత చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.. టాస్క్ ఫోర్స్ టీమ్‌కి ఆరు నెల్లకు ఒకసారి ఒక డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు..

కేవలం ఉన్నతాధికారుల నివేదికల కోసం అనట్లు అప్పుడప్పుడు "ఫోటోషూట్" చర్యలు కూడా చేపడతారు.. అదికూడా అక్రమార్కులకి పెద్దగా నష్టం వాటిల్లకుండా జాగ్రత్త వహిస్తారు.. ఈ జాగ్రత్త వ్యవహారాన్ని సంబంధిత ఏరియా టౌన్‌ప్లానింగ్ అధికారులు సబ్బంది, అనధికారికంగా మానిటరింగ్ చేస్తారు.. మరి తీసుకున్న ముడుపులకు ఆ మాత్రం న్యాయం చేయాలి కాదా..! దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా వ్యవహరిస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ మహానగరంలో ఖరీదైన ప్రభుత్వ భూములతో పాటు..! అత్యంత విలువైన చెరువులు, చారిత్రక నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25, గాజులరామారం సర్కిల్-26 టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు బరితెగించి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం ఉన్నతాధికారులకు తెలియకపోవడం శోచనీయం.. కుప్పలు తెప్పలుగా అనుమతులు తీసుకున్నా..! తీసుకోకపోయినా..! ప్రమాదకర కట్టడాలుగా వెలుస్తున్నాయి.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తూ..! ప్రమాదకర కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు.. "నోటీసులు"- "స్పీకింగ్ ఆర్డర్‌లు" జారీ చేసిన జీహెచ్ఎంసి చర్యలకి దూరంగానూ, ముడుపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. సర్కిల్‌ల డిప్యూటీ కమిషనర్‌లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ సూపర్‌వైజర్‌లు, న్యాక్ఇంజనీర్‌లు, చైన్‌మెన్‌లు ఇంత మంది టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో విధుల్లో ఉన్నప్పటికీ ప్రతి కట్టడం అక్రమమే కాదని ఏ టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతారో ముందుకు రావచ్చు.. ముఖ్యంగా అధికారుల్లో జవాబుదారీ తనం అంతరించి పోయింది.. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కనుమరుగు అయిందని చెప్పడంలో అతిశయోక్తి కాదు.. టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కరెప్షన్ అధికారులపై వేటు వేయకపోతే "నీటి సంక్షోభంలో" మరో బెంగుళూరు పరిస్థితి హైదరాబాద్ నగరానికి త్వరలోనే వస్తుంది..

## బ్యానర్ పెట్టి..రిబ్బన్ కట్టి.. సీజింగ్‌లు దేనికి..?

కుత్బుల్లాపూర్ సర్కిల్-25 పరిధి సుభాష్ నగర్‌లో సీజ్ చేసిన భారీ అక్రమ షెడ్ల నిర్మాణాలు యధావిధిగా పనులు పూర్తి చేసినా చర్యల్లేవు.. ఫాక్స్‌సాగర్ నాలాపైనే దర్జాగా నిర్మాణాన్ని సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ మళ్ళీ పనులు చేస్తున్నా పట్టింపు లేదు.. గాజులరామారం సర్కిల్-26 పరిధిలోనూ కంటితుడుపు చర్యల్లో భాగంగా..! పలు అక్రమ కట్టడాలను సీజింగ్‌లు చేసిన టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ చట్టంలోని లొసుగులతో సహకరించడం విశేషం.. నోటీసులు, సీజింగ్‌లు జారీ కేవలం, అక్రమ నిర్మాణ దారులకు సహకరించేందుకేనని వచ్చే ఆరోపణలకు అధికారులు బలం చేకూరుస్తున్నారు..కమిషనర్, ఏసిపి, టిపిఎస్ హోదాలతో విధులు నిర్వర్తించే అధికారులు అక్రమ నిర్మాణాలు అరికట్టడంలో విఫలమవుతున్నారు.. గాజులరామారం పరిధిలో మహదేవ్ పురం, శ్రీరామ్‌నగర్, పలు ప్రాంతాలలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు.. సీజ్ చేసినవి తొలగించి దర్జాగా పనులు..

## సిద్ది వినాయక నగర్‌లో "స్పీకింగ్ నోటీసుల"తో వసూళ్ళు..భవనమే సాక్ష్యం..

"5 అంతస్తుల" అక్రమ నిర్మాణానికి "స్పీకింగ్ ఆర్డర్" జారీచేసిన అధికారులు భేరం కుదుర్చుకుని, చర్యల విషయాన్ని మరిచారు.. 8 నెలలు గడిచినా చర్యలు లేవంటే నమ్ముతారా..? ఏ మేరకు అధికారులు బరితెగించి వ్యవహరిస్తున్నారో చూడండి..

గాజులరామారం సర్కిల్-26 సూరారం 129 డివిజన్ సిద్దివినాయక నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా..! "గ్రౌండ్+5" అంతస్తులు నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ బహిరంగంగానే సహకరిస్తుంది.. సెట్‌బ్యాకులు లేకుండా "గ్రౌండ్+3" అంతస్తులు నిర్మించి 4వ అంతస్తుకు పిల్లర్‌లు కూడా రైజ్ చేసిన సమయంలో జీహెచ్ఎంసి అధికారులు "షో"కాజ్" నోటీసు నెం.5066/UC/TPS/C26/KPZ/ GHMC/2024 dt: 18.04.2024. జారీచేశారు.. అక్రమార్కుల నుండి సమాధానం రాలేదు.. ఆతర్వాత స్పీకింగ్ ఆర్డర్‌ను 27-04-2024న TS-BPASS చట్టం 2020 అండ్ GHMC చట్టం 1955 కింద స్పీకింగ్ ఆర్డర్ జారీచేశారు.. నెం.5066/UC/TPS/C-26/KPZ/GHMC/2024.. అయితే స్పీకింగ్ ఆర్డర్ జారీచేసే నాటికి "గ్రౌండ్+3" అంతస్తులతో 4వ అంతస్తుకు పిల్లర్‌లు మాత్రమే ఉండగా..! టౌన్‌ప్లానింగ్ అధికారుల సౌజన్యంతో ప్రస్తుతం, మొత్తం "గ్రౌండ్ం5" ఫ్లోర్‌లు పూర్తిచేసి బయట రంగులు లోపల పనులు పూర్తి చేశారు.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమా..? అక్రమార్కులతో భేరం కుదుర్చుకోవడమా..? అనేది జీహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

## "సీజింగ్‌లు కరెప్షన్ కోసమా..? నోటీసులు అంటే చిత్తుకాగితాలా..?

చట్టం తెలిసిన జీహెచ్ఎంసి అధికారులే, చట్టాలను పక్కనపెట్టి, అక్రమ కట్టడాలను ప్రోత్సహించడం బాధాకరం.. సెట్‌బ్యాకులు లేకపోయినా, ఇంటి అనుమతులతో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించినా పట్టించుకోరు.. అసలు అనుమతులు లేని నిర్మాణాలు కూడా, నోటీసులతోనే చర్యలు స్తంభించిపోతాయి.. కారణం ముడుపులు.. జీహెచ్ఎంసి టాస్క్ ఫోర్స్ టీమ్ ఎందు కోసం ఏర్పాటు చేశారో కానీ.. అక్రమ కట్టడాల కరెప్షన్ కోసమని మాత్రం స్పష్టమవుతుంది.. చట్టప్రకారం, పలు చట్టాలని పేర్కొంటూ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్‌లు ఇచ్చిన జీహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు తదుపరి చర్యలకు వెల్లరు.. ఆ నోటీసుల నుండి ఎలా తప్పించుకోవాలో సూచనలు చేస్తారు.. అందుకు సరిపడా ఫీజులు కూడా వసూల్ చేస్తారు.. అధికారులు ఉన్నదే అక్రమాలని సక్రమం చేసేందుకు అంటూ విమర్శించే వారు లేకపోలేదు..










# సాంకేతిక పరిజ్ఞానంతో పాటు.. ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశం..

## ఐటిఐ మహిళా కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు..



ఘట్‌కేసర్‌లో మహిళా ఐటిఐ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ఛీఫ్ విప్ మహేందర్ రెడ్డి..



- మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో హిందుస్తాన్ ఏరోనాటికల్ వారి సౌజన్యంతో కళాశాల..
- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నూతనంగా నిర్మించిన ఐటిఐ కళాశాలల ప్రారంభం..
- మహిళా సాధికారత దిశగా ఘట్కేసర్ మండలంలో మహిళల కోసం ఐటిఐ కళాశాల నిర్మాణం..
- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 10:** విద్యార్థులకు అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞాన్ని అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.. మేడ్చల్ జిల్లాలోని ఘట్కేసర్ మండలంలో హిందుస్థాన్ ఏరోనాటికల్ వారి సౌజన్యంతో నిర్మించిన, ఐటిఐ మహిళా కళాశాలను ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి లతో కలిసి మంగళవారం మంత్రి ప్రారంభించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నూతన నిర్మాణాలు చేపట్టిన ఐటిఐ కళాశాలలను ప్రారంభించుకుంటున్నామని, ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు.. అందులో భాగంగానే రాష్ట్రంలో అధునాతన పరిజ్ఞానంతో కూడిన ఐటిఐ కళాశాలలో నిర్మించడం జరుగుతుందన్నారు.. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మహిళా సాధికారత దిశగా ఘట్కేసర్ మండలంలో మహిళల కోసం నిర్మించిన ఐటిఐ కళాశాలను ప్రారంభించడం ఎంతో హర్షనీయమన్నారు.. భవిష్యత్తులో ఉపాధి పొందే దిశగా అధునాతనమైన ట్రైనింగ్ కోసం..! సంబంధిత పరికరాలతో కూడిన తరగతి గదులను అధునాతన పరికరాలతో నిర్మించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు.. మహిళలకు అవసరమైన విభాగాలలో గుర్తించి అందుకు అనుగుణంగా తరగతి గదులను, పరికరాలతో నిర్మించి వారికి విషయపరిజ్ఞానం పెంపొందించేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.. మహిళలకు అవసరమైన ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు మిషనరీతో పాటు కొత్త కొత్త హంగులతో ఏ విధంగా తయారు చేయాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మంత్రి ఉదాహరణగా సూచించారు.. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.. తరువాత ఘట్కేసర్‌లోని గురుకుల్ జూనియర్ కాలేజీలో రూ. 1.5 కోట్ల అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు.. అక్కడే సీఎం కప్ ఆటల పోటీలను ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో సైదులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.








# తహాశీల్దార్ కార్యాలయాన్ని.. అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

## ఘట్‌కేసర్ తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..



తహాశీల్దార్ కార్యాలయంలో అధికారులతో విజయేందర్ రెడ్డి సమీక్ష సమావేశం..



ఘట్‌కేసర్ తహాశీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్..



మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 10:** ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు..హా మంగళవారం ఘట్కేసర్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు.. పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్స్ భూసేకరణ, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అడిషనల్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని సూచించారు.. కబ్జాల వెనుక ఎంతటి వారు ఉన్నప్పటికీ చర్యలకు వెనుకడుగు వేయొద్దని, తహాశీల్దార్, ఆర్ఐలకి సూచించారు.. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో సైదులు ఘట్కేసర్ తహసిల్దారు తదితరులు పాల్గొన్నారు..

- తహాశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్..
- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు..
- పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, భూ సేకరణ, ప్రభుత్వ భూమిలపై సమీక్ష నిర్వహించారు..

# క్రికెట్ జట్టుకు షూస్ పంపిణీ..

## కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 10:** సింగ్ సూర్మి క్రికెట్ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటున్న ఏకె-47 క్రికెట్ జట్టుకు పీపుల్స్ న్యూస్ దినపత్రిక ఎడిటర్ కె.శ్రావణ్ కుమార్ ఆయన కార్యాలయంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ షూస్‌ను పంపిణీ చేశారు. గాజుల రామారామరం కేటీఆర్ బస్తీలోని ఆటగాళ్లకు క్రీడలో పాల్గొనేందుకు స్పోర్ట్స్ షూస్ లేకపోవడంతో విషయం తెలుసుకున్న పీపుల్స్ న్యూస్ దినపత్రిక ఎండి కె. శ్రావణ్ కుమార్ సోమవారం గాజులరమారం లోని దినపత్రిక కార్యాలయంలో జట్టు సభ్యులైన 12 మందికి షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జరగబోయే టోర్నమెంట్‌లో ఏకే-47 జట్టు గెలుపొందాలని ఆకాంక్షించారు. ముమ్ముందు క్రీడాకారులకు మరేదైనా సహాయం కావాలంటే తనను సంప్రదించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులందరూ శ్రావణ్ కుమారును శాలువాతో సన్మానించారు. అనంతరం కేటీఆర్ నగర్ బస్తీ ప్రెసిడెంట్ కరణ్ సింగ్ మాట్లాడుతూ తమ కాలనీలోని జట్టు క్రికెట్ మ్యాచ్ లో పాల్గొన్నందుకు షూస్ లేవని తెలుసుకొని 12 మంది సభ్యులకు బూట్లు అందజేయడం ఎంతో ఆనందాన్నిస్తుందని. శ్రావణ్ కుమార్ కోరిన విధంగా తప్పనిసరిగా ఏకే-47 జట్టు విజయం సాధించి కప్పుతో తిరిగి వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులందరూ కృతజ్ఞతలు తెలిపారు.



## హార్ట్ ప్రాబ్లమ్..ఆస్పత్రి బిల్డంగ్‌పై నుంచి దూకిన రోగి..స్పాట్‌లోనే చనిపోయాడు




**హైదరాబాద్ పెన్ పవర్:**హాస్పిటల్ బిల్డింగ్‌పై నుంచి దూకి రోగి సూసైడ్ చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్‌జిల్లాలో చోటుచేసుకుంది. జీజీహెచ్ హాస్పిటల్ బిల్డింగ్ ఆరవ ఫ్లోర్ పై నుంచి చాట్ల లక్ష్మణ్ (50) అనే వ్యక్తి దూకడంతో తీవ్రగాయాలతో స్పాట్‌లోనే చనిపోయాడు. నాగారం ఏరియాకు చెందిన చాట్ల లక్ష్మణ్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య శకుంతల ఒక కొడుకు ఉన్నాడు. కొంతకాలంగా హార్ట్ సమస్యతో మానసిక కుంగుబాటు ఎదుర్కొంటున్నాడు. నాలుగు రోజుల కింద ఒంటివాపులు ఆయాసంతో జీజీహెచ్ హాస్పిటల్ లో ఇన్ పేషెంట్ గా చేరాడు. ఇవాళ పొద్దున్న తన బెడ్ నుంచి లేచి ఆరవ ఫ్లోర్ కు వెళ్లి దూకేశాడు. అక్కడున్న పేషంట్లు ఆపే ప్రయత్నం చేస్తున్నంత లోపు రెప్పపాటులో కిందకు దూకేశాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం వేడుకలు..





మానవహక్కులపై విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న మధుబాబు చికిలే..

- వివక్ష లేని సమాజం కోకుకునేదే.. మానవ హక్కు: మధుబాబు చికిలే సామాజిక వేత్త..
- ప్రజల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛకై రక్షణను ప్రోత్సహించడానికి మానవహక్కులు..
- మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన 10 డిసెంబర్ 1948లో ఆమోదించబడింది..

**దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 10:**కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ, లింగ వివక్ష లేని సమాజం కొరకు మానవ హక్కులు ఉన్నాయని సామాజిక వేత్త, ప్రపంచ మానవహక్కుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి మధుబాబు చికిలే అన్నారు.. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని, సూరారం కాలనీ లోని కృషి హై స్కూల్‌లోని విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.. మధుబాబు చికిలే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎటువంటి వివక్ష లేని సమాజం కోరుకునేదే నిజమైన మానవ హక్కు అన్నారు.. తొమ్మిదో తరగతి సోషల్ సబ్జెక్టులో మానవ హక్కుల గురుంచి, ప్రాథమిక హక్కుల గురుంచి ఉన్నాయని చెప్పారు.. ఐక్య రాజ్య సమితి విశ్వ మానవ హక్కుల ఒప్పంద పత్రం అమలులోకి వచ్చిన రోజు డిసెంబర్ 10 అని అన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ, లింగ వివక్ష లేని సమాజం కొరకు మానవ హక్కులు ఉన్నాయని అన్నారు.. అనంతరం విద్యార్థులు అడిగిన హక్కులు బాధ్యతలు, నియమాలకు చట్టాలకు తేడా, సమానత్వం, రిజర్వేషన్ లాంటి అంశాలపై విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ , మానవ హక్కుల యువజన విభగాం కన్వీనర్ అమర్ కాంబ్లె, ఉపాధ్యాయులు మహేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.







# ఎస్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి..

## రిటైర్డ్ హైకోర్టు జడ్జిని కలిసిని ఎమ్మార్పీఎస్ నాయకుల వినతిపత్రం..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 10:** సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని..! ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.. మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ రిటైర్డ్ హైకోర్టు జడ్జ్ శమీ అత్తర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ త్వరగా పూర్తిచేయాలని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మరియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పక్షాన వినతి పత్రం ఇవ్వడం అందజేశారు.. ఈ కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బైరపోగు శివకుమార్ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు..

# కొంపల్లిలో రక్తధాన శిబిరం..

**సోనియా గాంధి జన్మదిన వేడుకల సందర్భంగా "భైరీ ప్రశాంత్ గౌడ్" ఆధ్వర్యంలో శిబిరం..**

**గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభం..**

**కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..**








**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 10:** అఖిలభారత కాంగ్రెస్ అగ్రనేత, తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భైరీ ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హనుమాన్ యూత్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని సుమారు వంద మందికి పైగా రక్తదానం చేశారు.. అదేవిధంగా కేక్ కట్ చేసి మహిళా కాంగ్రెస్ నాయకులకు శాలువాలతో సన్మానం చేశారు.. రక్తధాన శిబిరం నిర్వహకులు కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. నిత్యం జరిగే ప్రమాదాలతో ఎంతోమంది రక్తం దొరకక ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదంలో గాయపడిన వారికి ఈ శిబిరాల నుండి సేకరించిన రక్తాన్ని సకాలంలో అందజేసి ప్రాణాలు కాపడుతారాని అన్నారు..ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రతిఒక్కరికి, రక్తధానం చేసి ప్రాణ దాతలుగా ఉండాలని అన్మారు..

ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్ బైరి శ్రీవిద్య,బైరి సరిత శివకుమార్ గౌడ్,కొంపల్లి మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్ నాగమణి,సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చల్ల మాధవి గోపాల్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, రేణుక అశోక్ రెడ్డి,కావలి చంద్రకళ గోపాల్,ఎత్తి రాజులు,ఉపేందర్ రెడ్డి, పూర్ణచందర్రావు, ఆంజనేయులు ముదిరాజ్,శ్రీనివాస్ గౌడ్,షేక్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు..



# వాహనదారులు, మెకానిక్‌ల్లారా జాగ్రత్త.. బండి సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ కేసులు

**వరంగల్ పెన్ పవర్::** వాహనంతో పాటు వచ్చే సైలెన్సర్లను నిబంధనలకు విరుద్ధంగా మార్చి అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్ల అమరుస్తున్నారు కొందరు వాహనదారులు. చెవులకు చిల్లులు పడేలా శబ్ధం వచ్చే ఈ మోడిఫై సైలెన్సర్ల వల్ల రోజు రోజుకీ వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ఎయిర్ పొల్యూషన్‌తో పాటు వాహనదారులు, ప్రయాణికులు ఈ సైలెన్సర్ల భారీ సౌండ్లకు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఈ మోడీఫై సైలెన్సర్ల సౌండ్ వల్ల కొందరు మరణించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా బండ్ల సైలైన్సర్లు మారుస్తున్నా వారిపై వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. మంగళవారం (డిసెంబర్ 10) హనుమకొండలోని అథాలత్ జంక్షన్ వద్ద అధిక శబ్ధం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వాహనదారులు, మెకానిక్‌లకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు బండ్లకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేయకూడదని సూచించారు.



ట్రాఫిక్ నిబంధనలు విరుద్ధంగా సైలెన్సర్లు మారిస్తే వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఏడాది జనవరి నుంచి వరంగల్ ట్రైసిటీలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి 1122 సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శబ్ధకాలుష్యానికి పాల్పడేలా బైక్‌లు నడిపే వారితోపాటు... మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాళ్ల తల్లిదండ్రులపైనా చర్చలు తప్పవని హెచ్చరించారు.

# మోహన్ బాబు, మనోజ్ ఒకరినొకరు నెట్టుకున్నారు : ఫాంహౌస్ పని మనిషి

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచు ఫ్యామిలీ వివాదం తారాస్థాయికి చేరింది. మూడు రోజుల నుంచి మంచు ఫ్యామిలీ గొడవ టాలీవుడ్ సర్కిల్ లో హాట్ టాపిక్ గా మారింది. డిసెంబర్ 9న మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పర ఫిర్యాదులతో ఈ వివాదం రచ్చకెక్కింది. అయితే మోహన్ బాబు ఫాంహౌస్ లో పనిచేసే మహిళ ఇంటి గుట్టును బయటపెట్టిన వీడియో ఇపుడు వైరల్ అవుతోంది.




**మౌనికతో పెళ్లి ఇష్టం లేదు**

మంచు ఫ్యామిలీ గొడవలపై మోహన్ బాబు ఫాంహౌస్ లో పనిచేసే మహిళ చెప్పిన విషయాలు ఏంటంటే.?.. మోహన్ బాబు, మంచు మనోజ్ గొడవపడ్డారు.తండ్రీ కొడుకులు నెట్టుకున్నారు.. మనోజ్ కు దెబ్బలు తగల్లేదు. అసలు భూమా మౌనికతో మనోజ్ రెండో పెళ్లి ఎవరికీ ఇష్టం లేదు. మోహన్ బాబు మీద చేయి పడితే విష్ణు ఊరుకోడు. ఇద్దరి అన్నదమ్ముల మధ్య చాలా రోజుల నుంచి మనస్పర్థలు ఉన్నాయి.. అసలు ఈ గొడవకు కారణం వాళ్ల స్టాఫ్. మంచు లక్ష్మి వచ్చి నచ్చచెప్పారు. అని పనిమనిషి చెప్పడం ఇపుడు హాట్ టాపిక్ గా మారింది.

**ఫాంహౌస్ దగ్గర ఉద్రిక్తత**

డిసెంబర్ 10న ఉదయం జల్‌పల్లిలోని మోహన్ బాబు ఫామ్‌హౌస్ దగ్గర మంచు మనోజ్ బౌన్సర్లకు, మరో వైపు విష్ణు బౌన్సర్లకు మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే.. మనోజ్ బౌన్సర్‌లను విష్ణు బౌన్సర్లు బయటకు పంపిస్తుండటంతో గొడవ జరిగింది. మౌనికతో బౌన్సర్లు వీడియో కాల్ మాట్లాడారు. గొడవ జరుగుతుండటంతో గమనించిన మంచు విష్ణు బయటకి వచ్చి బౌన్సర్లును బయటకి తోసేశారు.

**ఆస్తుల కోసం కాదు ఆత్మగౌరవం కోసం పోరాటం**


మరో వైపు డబ్బు కోసం, ఆస్తి కోసం పోరాటం చేయటం లేదని, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేస్తున్నానని మనోజ్ మీడియా ఎదుట చెప్పాడు. తన బిడ్డలు ఇంట్లో ఉండగా ఇలా చేయడం సరికాదని, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నార మనోజ్ మండిపడ్డాడు. న్యాయం కోసం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలను కలుస్తానని, తన భార్యాపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని, అందుకే ఈ పోరాటం అని మనోజ్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

**పరస్పర ఫిర్యాదులు**

తనపై గుర్తు తెలియని 10 మంది వ్యక్తులు దాడి చేశారని..తనకు ప్రాణహానీ ఉందని డిసెంబర్ 9న మనోజ్ పహాడీషరీఫ్ పీఎస్ లో ఫిర్యాదు చేస్తే.. మంచు మనోజ్,మౌనిక నుంచి తనకు ప్రాణహానీ ఉంది.తనకు రక్షణ కల్పించాలంటూ మోహన్ బాబు రాచకొండ సీపీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే..

# 2 వేల కోసం లోన్ యాప్ వేధింపులు.. కొత్త పెళ్లి కొడుకు ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:**లోన్ యాప్ వేధింపులు పీక్ స్టేజ్‌కు చేరాయి. అత్యంత దుర్మార్గంగా వేధిస్తున్నాయి. లోన్ అంతా కట్టినా.. ఇంకా 2 వేల రూపాయలు కట్టాలంటూ వేధింపులకు గురి చేశాయి. అంతేనా.. కొత్తగా పెళ్లయిన భార్య ఫొటోలను సైతం మార్ఫింగ్ చేసి మరీ.. అందరికీ పెట్టారు. కేవలం 2 వేలు అంటే 2 వేల రూపాయల కోసం అత్యంత నీచంగా చిత్రీకరించారు లోన్ యాప్ సిబ్బంది.. ఈ అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకన్నాడు ఆ కొత్త పెళ్లి కొడుకు.కేవలం 40 రోజుల క్రితమే పెళ్లయిన ఆ యువకుడు.. లోన్ యాప్ చేసిన అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాధ ఘటన ఏపీలోని విశాఖపట్నంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా- అంగడి దిబ్బకు చెందిన నరేంద్ర(21) అనే యువకుడికి 40 రోజుల కిందే పెళ్లి జరిగింది. వ్యక్తిగత అవసరాల కోసం నరేంద్ర ఓ ప్రైవేట్ లోన్ యాప్‌లో అప్పు తీసుకున్నాడు. విడతల వారీగా తిరిగి అప్పు చెల్లించాడు. అయితే, మరో కూ.2 వేలు లోన్ అమౌంట్ పెండింగ్‌లో ఉంది. దీంతో రెండు వేల కోసం లోన్ యాప్ ఏజెంట్లు నరేంద్రను వేధించారు. త్వరలోనే పెండింగ్ ఉన్న డ్యూ అమౌంట్ ను కట్టేస్తానని చెప్పిన వినకుండా లోన్ యాప్ ఏజెంట్లు బెదిరింపులకు పాల్పడ్డారు. ఇక్కడితో ఆగని లోన్ యాప్ ఏజెంట్లు మరో దారుణానికి ఒడిగట్టారు. కొత్తగా పెళ్లి చేసుకున్న నరేంద్ర, అతడి భార్య ఫొటోలను మార్ఫింగ్ చేసి కుటుంబ సభ్యులకు, బంధువులకు పంపించారు. ఈ ఘటనతో బంధువులు, ఫ్యామిలీ మెంబర్స్ దగ్గర పరువు పోయిందని నరేంద్ర తీవ్ర మనస్థాపానికి గురి అయ్యాడు. ఈ క్రమంలోనే 2024, డిసెంబర్ 10వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని నరేంద్ర ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతుడు నరేంద్ర కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోన్ యాప్ ఏజెంట్ల ఆగడాల వల్ల తమ కుమారుడు మృతి చెందినట్లు పేర్కొన్నారు.




మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఫొటో మార్ఫింగ్ చేసి నరేంద్రను వేధించిన లోప్ యాప్ ఏజెంట్లను గుర్తిస్తామని చెప్పారు. 40 రోజుల కిందే పెళ్లి చేసుకున్న తమ కొడుకు.. లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడటం తో మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీ రుగా విలపిస్తున్నారు. తమ కుమారుడి చావుకి కారణమైన వారిని వదిలిపెట్టొద్దని.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## సాగర తీరాన నిలువెత్తు సాక్ష్యం.. సీఎం రేవంత్ వ్యాఖ్యలకు ప్రశాంత్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్‌హయాంలో అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడా ఆవిష్కరించలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పందించారు. హుస్సేన్ సాగర తీరాన అమరవీరుల స్మారక చిహ్నం ప్రాంగణంలో కొలువుదీరిన పసిడి వర్ణం తెలంగాణ తల్లి విగ్రహమే నిలువెత్తు సాక్ష్యం అని స్పష్టంచేశారు. 'అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. తెలంగాణ తల్లి దీవెనలతో నా రాష్ట్రం పసిడి తెలంగాణగా విరాజిల్లాలని కేసీఆర్ జూన్ 22 ,2023 నాడు తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించారు' అని ట్వీట్ చేశారు.

## ములుగు జిల్లాలో పెద్దపులి.. భయాందోళనలో స్థానికులు




**హైదరాబాద్ పెన్ పవర్:**ములుగు జిల్లాలో పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. వెంకటాపురం మండలం ఆలుబాక శివారులో పెద్దపులి సంచరిస్తోంది. ఆలుబాక-బోధాపురం మిర్చి తోటకు వెళ్ళే గోదావరి పాయలో పెద్దపులి అడుగుజాడలు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పుచ్చతోట దగ్గర పడుకున్న రైతులకు పులి అరుపులు వినిపించినట్టు చెబుతున్నారు.

డిసెంబర్ 10న ఉదయం స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని పెద్దపులి అడుగులను గుర్తించారు ఫారెస్ట్ అధికారులు. పెద్దపులి జాడ దొరికే వరకు పరిసర ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అప్పులు చేసి మరీ స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టాడు.. పాపం నష్టాలు రావడంతో..



**హైదరాబాద్ పెన్ పవర్:** స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. తాజాగా ఓ యువకుడు చేసిన పనికి కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామనికి చెందిన శివప్రసాద్ అనే యువకుడు స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. హైద్రాబాద్ లో చదువుకున్న శివప్రసాద్.. ఉద్యోగం లభించక పోవడంతో ఇంటి వద్దే ఉంటూ కిరాణం నడుపుతున్నాడు. ఈజీ మనీ కోసం అప్పులు చేసి మరీ స్టాక్ మార్కెట్ లో ఇన్వెస్ట్ చేశాడు. పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో కుటుంబం అప్పుల్లో కూరుకుపోయింది. అప్పులు కట్టలేని స్థితిలో ఆందోళనలో కుటుంబం మొత్తం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు మొండయ్య (60) , శ్రీదేవి (50), కూతురు చిట్టి (30), కొడుకు వివప్రసాద్ (26).. ఇలా కుటుంబం మొత్తం ఆత్మహత్యా యత్నం చేసింది. వీరందరినీ చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. శివప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీని కలిసిన మంచు మనోజ్

**భార్య మౌనికతో కలిసి డీజీ కార్యాలయానికి మనోజ్**

**తమ కుటుంబంలో జరుగుతున్న పరిణామాలను వివరించిన మనోజ్**

**తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్ పెన్ పవర్:** సినీ నటుడు మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలిసి తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డిని కలిశారు. తన కుటుంబంలో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించారు. తనకు, తన భార్యకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. మంచు మనోజ్, మౌనిక కారులో వచ్చిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఆ తర్వాత మంచు మనోజ్ తెలంగాణ డీజీపీ జితేందర్ రెడ్డిని కూడా కలిసే అవకాశాలు ఉన్నాయి.మోహన్ బాబు, మంచు మనోజ్ మధ్య వాగ్వాదం, పరస్పర పోలీస్ ఫిర్యాదులు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మొదట వీరిద్దరు పరస్పర ఆరోపణలతో లేఖలు విడుదల చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తమపై దాడి చేశారని, తనకు, తన భార్యకు ప్రాణహాని ఉందని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో నిన్న మంచు మనోజ్ ఫిర్యాదు చేశారు. మరోవైపు, మనోజ్, అతని భార్య మౌనిక నుంచి తనకు ప్రాణహాని ఉందని మోహన్ బాబు లేఖ ద్వారా రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

# బెస్ట్ ఎంప్లాయి కావాలనుకుంటున్నారా.. అయితే ఆఫీసులో ఇలా ఉండండి..!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆఫీస్ లో పర్ ఫెక్ట్ అనిపించుకోవాలనీ.. బెస్ట్ ఎంప్లాయ్ కావాలని అందరికి ఉంటుంది. కానీ అందరికీ సాధ్యంకాదు. కారణం.. తెలిసీ తెలియక పని వేళల్లో మనం చేసే పొరపాట్లే... అవే తోటి ఎంప్లాయిస్ దృష్టిలో నెగెటివ్ చేస్తాయ్. నలుగురూ పక్కన పెట్టేలా చేస్తాయ్. అలా కాకుండా ఉండాలంటే అవేంటో తెలుసుకుని సరిదిద్దుకుంటే బెస్ట్ ఎంప్లాయ్ అవ్వొచ్చు..




### ఓవర్ కాన్ఫిడెన్స్

వర్క్ ప్లేస్లో మన చేతలు కనిపించాలే కానీ మాటలు కాదు. అరగంటలో ఈ పని కంప్లీట్ చేస్తా... మీకెందుకు నేను చూసుకుంటా! అనే మాటలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇలాంటి మాటల వల్ల వాళ్లపై ఆఫీసర్లకు, తోటి ఉద్యోగులకు వాళ్లపై ఎక్స్ పెక్టేషన్స్ పెరుగుతాయ్. వాళ్ల అంచనాలకు తగ్గట్టుగా పని లేకపోతే వాళ్లపై నమ్మకం పోతుంది. ఇంకోసారి పని చెప్పాలన్నా సంకోచిస్తారు. అందువల్ల పనిచేసే చోట ఇలాంటి గొప్పలకు పోకూడదు.

ఒకవేళ పనిని అరగంటలో పూర్తి చేయగల కెపాసిటీ మీకు ఉన్నా ఆ విషయాన్ని బయటకు చెప్పకూడదు. డెడ్ లైన్స్ మధ్య పని చేస్తే ఒత్తిడికి లోనై తప్పులు దొర్లుతాయ్. అందువల్ల అరగంటలో చేయగలిగే పనికి ముప్పావు గంట కేటాయించాలి. ఎలాంటి మిస్టేక్ లేకుండా వర్క్ సబ్ మిట్ చేయాలి. అలాగే తలకు మించిన భారాన్ని తలకెత్తుకోకుండా మీకున్న సమయం. ..ఓపికని బట్టి పనిచేయాలి.

### దూరంగా ఉండండి

ఆఫీసులో రకరకాల మనస్తత్వాలున్న మనుషు లుంటారు. అలాంటి చోట పని చేసేటప్పుడు అందరితో కలివిడిగా ఉండకపోయినా పర్లేదు కానీ శత్రుత్వం పెట్టుకోకూడదు. ఎగతాళి మాటలతో ఇతరులను ఇబ్బంది పెట్టకూడదు.. ఒక్కొక్కరి ఆలోచనా విధానం ఒక్కోలా ఉంటుంది. అందువల్ల ఎదుటివాళ్లు తమ ఆలోచనలకు, అభిప్రాయాలకు తగ్గట్టుగా ఉండాలని కోరుకోవడం తప్పు ...నచ్చకపోతే దూరంగా ఉండాలి. కానీ, వాళ్లని నలుగురిలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేయకూడదు.

### ఎమోషన్స్ కంట్రోల్

వర్క్ ప్లేస్ లో ప్రతిచిన్న విషయాన్ని మనసుకి తీసుకుని బాధపడేవాళ్లు కొందరైతే....అలాంటి వాళ్లనే టార్గెట్ చేసుకుని టైంపాస్ చేసేవాళ్లు మరికొందరు. అందువల్ల కోపం లాంటి ఎమోషన్స్ ని ఎక్కువగా చూపించకూడదు. టార్గెట్ చేసే అవకాశం ఎదుటి వాళ్లకు ఇవ్వకూడదు. ఒకవేళ ఎలాంటి ప్రమేయం లేకుండా టార్గెట్ చేసినా వాటిని మనసుకి తీసుకోకుండా పెడచెవిన పెట్టాలి. మన ఎమోషన్స్ పై ఎదుటివాళ్లు అధిపత్యం యించకుండా చూసుకోవాలి.

### బాస్ లని అర్థం చేసుకోవాలి...

చాలామంది ఎంప్లాయినికి బాస్ లు నచ్చరు. దానికి కారణం బాస్ ఎంప్లాయిస్ కన్నా ఒకమెట్టు అధికారంలో పైనుండటమే. కానీ ఆ అధికారం అనుభవంతో వస్తుందని గుర్తించాలి. వాళ్లపై పదింతల పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆ ఒత్తిడిలో వాళ్లు ఏదైనా మాట అన్నా పరిస్థితులను అర్థం చేసుకోవాలి గానీ నెగెటివ్ గా చూడకూడదు. తోటి ఉద్యోగులతో కలిసి బాస్ ను తిట్టుకోవడం లాంటివి చేయకూడదు. ఏ ఆర్గనైజేషన్ అయినా సక్సెస్ ఫుల్ గా రన్ అవ్వాలంటే బాస్..... ఎంప్లాయిస్ మధ్య రిలేషన్ బాగుండాలి. అందువల్ల బాస్ తో మంచి రిలేషన్.... మెయింటెయిన్ చేయడం అవసరం. ఒకవేళ వర్క్ పర్ఫెక్ట్ గా ఉన్నా కూడా మాట వస్తే బాస్ తోమాట్లాడి అపోహలను క్లియర్ చేసుకోండి. అంతేకానీ నలుగురి దగ్గరికి ఆ మాటల్ని చేరవేయడం మంచిది కాదు.

### గాసిప్స్

ఇతరుల గురించి లేనిపోనివి కల్పించి గాసిప్స్ స్ప్రెడ్ చేయడం వల్ల ఆఫీసులో మంచి పేరు ఉండదు. ముఖ్యంగా పనిచేసేచోట, అనవసరపు గాసిప్స్ లో ఇన్వాల్వ్ అయితే నలుగురిలో నెగిటివ్ అవ్వడం ఖాయం. ఇలాంటి వాళ్లకి సాధ్యమైనంత దూరంగా ఉండటానికి అందరూ ఇష్టపడతారు. అందువల్ల దూరంగా ఉంటే అందరూ త్వరగా కలిసిపోతారు. వర్క్ విషయంలో ఏదైనా పొరపాటు చేసినా సరిదిద్దే ప్రయత్నం చేస్తారు.

### నెగెటివిటీకి దూరంగా...

కలిసి ఒక టీమ్ గా పనిచేస్తున్నప్పుడు పాజిటివ్ ఆలోచనలతో ముందుకెళ్లాలి. ఏదైనా నెగిటివ్ అనిపించినా.,.. సక్సెస్ అవ్వలేం అనిపించినా... ఆ ఆలోచనల్ని నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేయాలి. అంతేకానీ తోటి టీమ్ మెంటర్స్ బుర్రలోకి నెగెటివ్ ఆలోచనల్ని ఎక్కించే ప్రయత్నం చేయకూడదు.

### పాడైనవి పట్టుకు పోవద్దు...

కొందరు ఆఫీసుకి లేటు అవుతుందన్న హడావిడిలో ముందురోజు డిన్నర్లో మిగిలిన వంటల్ని లంచ్ బాక్స్ తెచ్చుకుంటారు. అది బాగుంటే ఓకే కానీ, అటుఇటు అయి పాడైతేనే ఇబ్బంది. పాడైన వంటలు లంచ్ బాక్స్ లో తీసుకొస్తే తోటి ఉద్యోగులకు ఇంప్రెషన్ పోతుంది. అందుకని లంచ్ తాజాగా ఉన్నవే తెచ్చుకోవాలి.

### ఉద్యోగం పై అయిష్టం...

'ఐ హేట్ మై జాబ్ ఈ మాట చాలా కామన్ అయిపోయింది ఈమధ్య ఈ మాట మనసులో అనుకుంటే ఓకే కానీ ఆఫీసులో పదేపద్ చెప్తేనే అసలు సమస్య ఉద్యోగమే నచ్చనప్పుడు ఎవరినైనా నమ్మి పనెలా అప్పగిస్తారు.. ఇంట్రెస్ట్ లేదని బాసు కూడా పక్కన పెడతారు. అందువల్ల అలాంటి మాటలు అనకూడదు. అంతలా నచ్చకపోతే నచ్చిన ఉద్యోగాన్ని ఎంచుకోవాలి. అంతేకాని మనం చేస్తున్న పనిని అసహ్యించుకుంటే ఎలా..

### వెనక మాట్లాడొద్దు...

పనిలో ఏదైనా పొరపాటు దొర్లితే ... దానికి చేసినవారిదే బాధ్యత. అందువల్ల ఎదుటివాళ్లపై తప్పుని రుద్దే ప్రయత్నం చేయకూడదు. ఒకవేళ ఎదుటివాళ్ల సలహాల వల్ల తప్పు జరిగినా దానికి పూర్తి బాధ్యత తీసుకోవాలి. ఇంకోసారి ఆ తప్పు జరగకుండా చూసుకోవాలి

## తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను తిరస్కరిస్తున్నాం: కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**సచివాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను తాము తిరస్కరిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపు మార్చడం దారుణమన్నారు. బతుకమ్మ తెలంగాణ ప్రత్యేక పండుగ అని, అలాంటి బతుకమ్మను తొలగించి హస్తం పార్టీ గుర్తును పెట్టడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యమ తల్లే తమ తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. గ్రాండ్‌గా ఉండే తెలంగాణ తల్లిని తీసి... బీద తల్లిని పెట్టామని రేవంత్ రెడ్డి గొప్పలకు పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదలుగానే ఉండాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులకు తాము భయపడేది లేదన్నారు. విగ్రహం నమూనాను మార్చినందుకు నిరసనగా పాలాభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం సరికాదన్నారు. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయని... కానీ పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది అన్నారు. అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి తొలగించారన్నారు.